

# విజేతలెవరో?

**ఇన్నాళ్ల ఉత్కంఠకు నేటితో తెర పడనుంది. నెలల తరబడి ఓపిగ్గా వేచి ఉన్నవారందరికి నేడు సస్పెన్స్ వీడబోతోంది. ఓట్ల లెక్కింపు ఫలితాలపై ఇప్పుడు అంతా ఆసక్తి నెలకొంది. మంగళ వారం ఉదయం 9 గంటలకే ప్రజా నాడి ఎటు వైపు నుందో? విజేతలెవరో.. పరాజితులెవరో? తేలిపోనున్నది..**

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల లెక్కింపు కోసం జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో మే 13తో పోలింగ్ ముగిసినప్పటి నుంచి నేటివరకు శాంతి భద్రతల పరిరక్షణ కోసం అధికారులు కుస్తీపడ్డారు. జిల్లా ప్రజలు ఓటు వేసిన ఈవీఎంలను భద్రపరిచారు. మంగళవారం లెక్కింపు కేంద్రాల్లో లెక్కించనున్నారు. ప్రతీ నియోజకవర్గానికి 14 టేబుల్స్ ఏర్పాటు చేసారు. ప్రతీ రౌండ్‌కు 14 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలను తీసుకురానున్నారు. వాటి లెక్కింపు పూర్తయిన తరువాత మరో 14 ఈవీఎంలను బయటకు తీసుకువస్తారు. అన్ని ఈవీఎంలు లెక్కింపు పూర్తయ్యే వరకు రౌండ్లు నిర్వహిస్తూనే ఉంటారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలో భీమవరం నియోజకవర్గంలోనే అత్యధిక ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో అధిక రౌండ్ల ఓట్లను లెక్కిస్తారు. నరసాపురం నియోజకవర్గంలో తక్కువ రౌండ్‌లోనే ఓట్ల లెక్కింపు ముగియనుంది. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులోనే ప్రజా నాడి తెలిసే అవకాశం ఉంది. ప్రతీ ఎన్నికల్లోను ఇదే జరిగింది. పోస్టల్ బ్యాలెట్‌లో ఏ పార్టీకి మెజార్టీ వస్తే ఈవీఎం యంత్రాల్లోను అదే పార్టీకి మెజార్టీ లభించింది. రాష్ట్రంలో ఆ పార్టీయే ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈసారి ఉద్యోగులంతా మార్పు కోరుకున్నారు. కూటమి వైపు మొగ్గుచూపారు. ఓటింగ్ సరళిలో అదే సంకేతాలు వెల్లడయ్యాయి.

### సిబ్బంది సిద్ధం

ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం సిబ్బందిని 959 మందిని నియమించారు. ఉదయం ఆరు గంటలకే కౌంటిగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకోనున్నారు. భీమవరం విష్ణు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఓట్లలెక్కింపు కోసం ఏర్పాట్లు చేశారు. విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో ఆచంట, నరసాపురం, పాలకొల్లు, తణుకు నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు చేస్తారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉండి, భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు సంబంధించి లెక్కిస్తారు. రెండుచోట్ల లెక్కింపు కోసం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### ఏజెంట్ల కోసం పోటీ

రాజకీయ పార్టీలు ఏజెంట్ల నియామకం కోసం పోటీ పడ్డాయి. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి ఒకవైపు, వైసీపీ మరోవైపు వీలైనంత ఎక్కువగా మందిని ఏజెంట్లుగా నియమించుకున్నారు. ఇండిపెండెంట్ల అభ్యర్థుల తరుపున కూడా తమ వారినే ఏజెంట్లుగా నియమించారు. తెలుగుదేశం కూటమి తరుపునే అధికంగా ఏజెంట్లు ఓట్ల లెక్కింపులో పాల్గొంటున్నారు. సోమవారం రాత్రికే ఏజెంట్లు భీమవరం చేరుకున్నారు.

## భీమవరంలో నేడే ఓట్ల లెక్కింపు

**ఢిల్లీ వెళ్లే ధీరులెవరో.. అసెంబ్లీలో అడుగుపెట్టే అదృష్టవంతులెవరో**

**ఉదయం 8 గంటల నుంచే పోస్టల్ బ్యాలెట్లు..8.30 నుంచి ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు మొదలు**

**ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల బరిలో 89 మంది,నరసాపురం ఎంపీ బరిలో 21 మంది అభ్యర్థులు పోటీ**

**కూటమిలో జోష్ ..వైసీపీ డీలా**



కౌంటింగ్ కోసం టేబుళ్ల ఏర్పాటు

| నియోజకవర్గం | అభ్యర్థులు | పోలైన ఓట్లు | రౌండ్లు |
|---|---|---|---|
| ఆచంట | 9 | 1,49,048 | 14 |
| పాలకొల్లు | 15 | 1,60,489 | 14 |
| నరసాపురం | 11 | 1,43,825 | 13 |
| భీమవరం | 15 | 2,00,857 | 17 |
| ఉండి | 13 | 1,93,722 | 18 |
| తాడేపల్లిగూడెం | 13 | 1,75,990 | 15 |
| తణుకు | 13 | 1,92,627 | 17 |

హోటల్స్ రాజకీయ పార్టీల నాయకులు, ఏజెంట్లతోనే భర్తీ అయిపోయాయి. ఏజెంట్లకు శిక్షణ ఇచ్చారు.

### జిల్లాలో 144 సెక్షన్

శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. ప్రతీ పట్టణంలోను కేంద్ర బలగాలను మోహరించారు. గడచిన కొద్దిరోజుల నుంచి కవాతులు నిర్వహించారు. ఎన్నికల రోజున జిల్లా అంతటా పోలీస్ నిఘా పెంచింది. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. అనుమానితులపై బైండోవర్ కేసులను నమోదు చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి అవాంచనీయ సంఘటనలకు పాల్పడితే జైలుకు పంపుతామని పోలీసులు ఇప్పటికే హెచ్చరికలు జారీచేశారు.

తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లో కూటమిదే విజయమనే విశ్వాసంతో ఉన్నారు. రాష్ట్రంలో అధికారం తమదే అంటూ వైసీపీ శ్రేణులు ఒకింత ఆశతో ఉన్నాయి. అయితే జిల్లాలో ఫలితాలపై ముందుగానే డీలా పడిపోయాయి.

- నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్లు వేసిన వారు 12,16,558.
- హోం ఓటింగ్ వినియోగించుకున్న వృద్ధులు 536 మంది. దివ్యాంగులు 553 మంది వున్నారు.
- పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నది 13,345 మంది
- జిల్లాలో 880 మంది సర్వీస్ ఓటర్లు బ్యాలెట్ ఓటును డౌన్లోడ్ చేసుకోగా ఇప్పటి వరకు 350 మంది పోస్టు ద్వారా పంపించారు.
- కౌంటింగ్ నిర్వహణకు సూపర్‌వైజర్లు 294 మంది, అసిస్టెంట్లు 348 మంది, మైక్రో అబ్జర్వర్లు 317 మందిని నియమించారు.

అనుమతించడం లేదు. ఏజెంట్లు పత్రాలు ఉన్నవారికి మాత్రమే కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు అనుమతి ఇస్తారు. ప్రతీ ఒక్కరిని తనిఖీ చేసిన తరువాత మాత్రమే లెక్కింపు కేంద్రంలోకి పంపనున్నారు. మరో వైపు విష్ణు, ఎస్ఆర్‌కేఆర్‌ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాలకు రెండు కిలోమీటర్ల దూరంలోనే వాహనాల రాకపోకలను నిషేదించారు. పోలీస్ యంత్రాంగం తణుకు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఒక జిల్లా స్థాయి అధికారిని అక్కడ ప్రత్యేక పరిశీలకునిగా నియమించారు.

### అందరూ భీమవరంలోనే మకాం

**ఆచంట :** సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం భీమవరంలో జరుగుతున్న దృష్ట్యా ఆయా పార్టీల కౌంటింగ్ ఏజెంట్లతో పాటు ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కూడా పెద్ద ఎత్తున భీమవరం వెళ్లారు. భీమవరంలో రూమ్‌లు బుక్ చేసుకుని ముందుగానే చేరుకుంటున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులకు కౌంటింగ్ రోజున మద్దతు తెలిపేందుకు అన్ని నియోజకవర్గాల నుంచి భీమవరం తరలి వెళుతున్నారు.



## అభ్యర్థుల్లో టెన్షన్..

ఎండనక వాననక అభ్యర్థులు రెండు నెలలు కష్టపడ్డారు. ఇంటింటా తిరిగి ఓట్లు అభ్యర్థించారు. కూటమి అభ్యర్థులు ఒక పక్క, మరోపక్క వైసీపీ అభ్యర్థులు నువ్వా నేనా అంటూ తలపడ్డారు. నర్సపురం పార్లమెంటు నియోజవర్గం పరిధిలో 7 నియోజకవర్గాల్లో రసవత్తర పోటీ సాగింది. పాలకొల్లు ఆచంట, తణుకు ఉండి నియోజకవర్గాల్లో తెలుగుదేశం అభ్యర్థులు బరిలో నిలిచారు. భీమవరం,తాడేపల్లిగూడెం, నరసాపురంలలో జనసేన అభ్యర్థులు పోటీ పడ్డారు. ఇరుపక్షాల అభ్యర్థులు రెండు నెలల పాటు అలుపెరగని పోరాటం చేశారు. మంగళవారం ఫలితాల కోసం అంతా ఊపిరి బిగపట్టి ఎదురుచూస్తున్నారు. ఏడు నియోజకవర్గల కూటమి అభ్యర్థులే విజయం సాధిస్తారంటూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులు విశ్వాసంతో ఉన్నాయి. భీమవరంలో పులపర్తి రామాంజనేయులు అంజిబాబు, వైసీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్‌ల మధ్య ప్రధానంగా పోటీ సాగింది. అంజిబాబు మెజారిటీపైనే ప్రధానంగా చర్చ సాగుతోంది. తణుకు పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గలలో కూడా మెజార్టీ పైనే దృష్టి పెడుతున్నారు. ఉండి నియోజకవర్గంలో రఘురామకృష్ణరాజు గెలుపు ఖాయం అని ప్రచారం సాగుతోంది. నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ విజయంపైనే అందరూ చర్చించుకుంటున్నారు. వైసీపీ తరపున పోటీ చేసిన ఉమాబాలను క్రాస్ ఓటింగ్ గట్టెక్కిస్తున్న నమ్మకం వైసీపీలో కనిపిస్తున్నది. కూటమి నాయకులు మాత్రం ఓటింగ్ సరళిని బట్టి క్రాస్ ఓటింగ్ జరగలేదంటూ కొట్టి పరేస్తున్నారు.

### కూటమిలో జోష్

ఎన్నికల ఫలితాల కోసం కూటమి నాయకులు, శ్రేణులంతా ఎదురుచూస్తూ వచ్చాయి. జిల్లాలో విజయం తమదే అంటూ ధీమాతో ఉన్నాయి. కూటమి అదిష్టానం వద్ద నియోజకవర్గాల వారీగా నివేదికలు చేరుకున్నాయి. ఓట్ల లెక్కింపులో తాము ఆశించిన ఫలితాలు వస్తాయని, కూటమి నాయకులు గట్టి నమ్మకంతో ఉన్నారు. చిన్నిచితకా నాయకుల నుంచి బడా నేతల వరకు పందేల కోసం కాలు దువ్వారు. ఎగబడి ఒకటికి రెండు రెట్లు ఇచ్చి పందేలు కాశారు. తాడేపల్లిగూడెం నియోజక వర్గంలో ఐతే ఒకటికి పది రెట్లు అంటూ పందేలు కాశారు. నరసాపురం పార్లమెంట్‌తోపాటు ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఉండి,

### మెజార్టీపైనే లెక్కలు

జిల్లాలో మెజార్టీపైనే లెక్కలు వేసుకుంటున్నారు. కూటమి అభ్యర్థులకు ఎంత మెజార్టీ వస్తుందనే దానిపై ఇప్పటి వరకు చర్చ సాగుతూ వచ్చింది. సర్వే సంస్థలు కూడా ఎగ్జిట్ పోల్స్‌లో కూడా జిల్లాలో కూటమి విజయం సాధిస్తుందని సంకేతాలు ఇచ్చాయి. ప్రతీ నియోజకవర్గంలో ఊహించిన దానికంటే మెజార్టీ వస్తుందని కూటమి నేతలు విశ్వసిస్తున్నారు. చాలాచోట్ల మెజార్టీలపై పందాలు సాగాయి. అదే విధంగా రౌండ్ల వారీగా మెజార్టీ పందాలు కూడా వేసుకున్నారు.

### సెల్ ఫోన్స్‌కు అనుమతి లేదు

ఏజెంట్లుగా వెళ్లేవారికి కౌంటింగ్ కేంద్రాల్లో సెల్‌ఫోన్లు

### మొదటి మూడు రౌండ్లే కీలకం

నరసాపురం, జూన్ 3: నరసాపురం ఎన్నికల ఫలితాల్లో మొదటి మూడు రౌండ్లే కీలకంగా మారనున్నాయి. మొత్తం 13 రౌండ్ల కౌంటింగ్‌లో మొదటి రౌండ్‌లో కే.బేతపూడి, కొప్పర్రు, మల్లవరం, మల్లవరం లంక, సరిపల్లి, చిట్టవరం, గొంది, కొత్త,పాత నవరసపురం గ్రామాలు ఉన్నాయి. రెండు నుంచి మూడు రౌండ్ చివరి వరకు పట్టణ ఓటర్ల రానున్నారు. ఈ నేపథ్యంలో మూడు రౌండ్లలో ఎవరూ మెజార్టీ సాధిస్తే వారే గెలుపు దిశగా ప్రయనిస్తారు. గతంలోను ఇదే తంతు కొనసాగింది. దీంతో మొదటి మూడు రౌండ్లపై రెండు ప్రధాన పార్టీలు ఆశతో ఉన్నాయి. తమకు ఐదు రౌండ్లలో భారీ మెజార్టీ వస్తుందని కూటమి ధీమాతో ఉంది. ఇటు వైసీపీ తమకు మూడు రౌండ్లలో మెజార్టీ ఉంటే అదే కొనసాగుతుందని ఆశతో ఉంది. ఇటు కూటమి భారీ మెజార్టీపై ఆశలు పెట్టుకుంది. ప్రజా వ్యతిరేకత తమకు కలిసి వచ్చిందని గతం కంటే పోలింగ్ ఎక్కువ జరిగినందున 25 వేలు మెజార్టీ దాటుతుందని అంచనా వేస్తున్నది. ఈ స్థాయిలో మెజార్టీ రావాలంటే ప్రతి రౌండ్‌కు 2 వేలు పైనే మెజార్టీ ఉండాలి. ఈ నేపథ్యంలో మొదటి మూడు రౌండ్లపై రెండు పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది.






సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అజిత వేజెండ్ల, పాల్గొన్న పోలీసు అధికారులు

## జిల్లా అంతటా హై అలర్ట్

భీమవరం క్రైం, జూన్ 3 : కౌంటింగ్ సందర్భంగా జిల్లా అంతటా పోలీసులు హై అలర్ట్ చేసినట్టు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు.. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత, నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు . భీమవరం పట్టణంలో వివిధ ప్రాంతాలలో సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి ఎస్పీ పరిశీలించారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ పటిష్టంగా అమలు చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన అనుమతి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి కౌంటింగ్ కేంద్రాలలోకి అనుమతించాలన్నారు. కౌటింగ్ కేంద్రాలకు విచ్చేసి కౌటింగ్ ఏజెంట్లు వాహనాలను ప్రత్యేకంగా నిర్ధేశించిన పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే వాహనాలను పార్కింగ్ చేయించాలి. సిబ్బంది ఎవరైనా అలసత్వం ప్రదర్శించినా, గైర్హాజరు అయినా శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కౌటింగ్ ప్రక్రియ సజావుగా శాంతియుతంగా పూర్తి చేసేందుకు ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీ శ్రీకాంత్, జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) భీమారావు, అదనపు ఎస్పీ మాసుమ్ బాషా, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ సత్య నారాయణ, రైల్వే డీఎస్పీ నాగేశ్వరరావు, సెబ్ డీఎస్పీ వెంకటనారాయణ, దిశా డీఎస్పీ నున్న మురళీకృష్ణ, ట్రైనీ డీఎస్పీ అరవింద్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### దుకాణాలు, మాల్స్ మూసివేత

జిల్లాలోని అన్ని దుకాణాలు, మాల్స్ మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. హాస్పిటల్స్, మెడికల్ షాపులు, అత్యవసర సేవలు తప్ప అన్ని దుకాణాలు, బార్లను సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి మూసివేశారు.లెక్కింపు ప్రక్రియను టీవీల్లో వీక్షించాలి తప్ప బయటకు వచ్చి అనవసర కేసుల్లో ఇరుక్కోవద్దని పోలీసులు హెచ్చరించారు. కౌంటింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటల వరకు ఉన్న నేపథ్యంలో ఆరోజు మొత్తం భీమవరం పట్టణం పోలీసుల ఆధీనంలో ఉంటుందన్నారు. రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో పొరపాట్లకు తావివ్వొద్దు : కలెక్టర్



పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై వివరిస్తున్న కలెక్టర్

భీమవరం టౌన్, జూన్ 3 : ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు అనుసరించి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియపై ఏఆర్‌వోలు, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు భీమవరం విష్ణు కాలేజీ లైబ్రరీ హాల్‌లో సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియలో ఫారం-13సి, ఫారం-13ఎ, ఫారం-13 బిలకు సంబంధించిన అంశాలపై వివరించారు. సర్వీస్ ఓటర్లకు సంబంధించి బ్యాలెట్ల లెక్కింపులో పూర్తి జాగ్రత్త వహించాలన్నారు. ఎలాంటి సొంత ఆలోచనలకు తావివ్వకుండా ఎన్నికల నిబంధనలను విధిగా పాటించి ఓట్ల లెక్కింపు నిర్వహించాలన్నారు. డీఆర్వో ఉదయ భాస్కరరావు, ఎన్నికల సెక్షన్ పర్యవేక్షకుడు చందన దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మద్రాపు సన్యాసిరావు, కౌంటింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అందని నిధులకు ఆడిటా..!

- ఉపాధ్యాయ వర్గాలు తీవ్ర అభ్యంతరం
- రెండేళ్లుగా స్కూలు నిర్వహణ భారం హెచ్‌ఎంలపైనే
- రూ.కోట్లలో బకాయిలు - ఒక్క రూపాయి జమ చేయకుండానే ఒత్తిళ్లపై విమర్శలు
- రేపటి నుంచి మూడు రోజులపాటు 764 పాఠశాలలకు ఆడిట్
- వాయిదా వేయాలంటూ డీఈవోకు పీఆర్టీయూ, యూటీఎఫ్ నాయకుల వినతి



ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 3 : పాఠశాలల నిర్వహణకు విడుదల కాని నిధుల వినియోగానికి సంబంధించి ఆడిట్ అంటూ సమగ్రశిక్ష జిల్లాప్రాజెక్టు చేపట్టిన హడావుడి ఓ చోద్యంలా మారింది. రెండేళ్లుగా అసలు విడుదల కాని స్కూల్ మెయింటెనెన్స్ గ్రాంట్‌లపై ఆడిట్ ఎలా చేస్తారంటూ ఉపాధ్యాయ వర్గాలు తీవ్ర అభ్యంతరం చెబుతున్నాయి. తొలివిడతగా జిల్లాలోని 764 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఆడిట్ చేపట్టడానికి ఈ నెల 5, 6, 7 తేదీల్లో గణాంక బృందాలు సంబంధిత మండల రిసోర్స్ కేంద్రాల్లో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించనున్నాయి. ఇందుకుగాను ఈ నెల 5న ఏలూరు మండల రిసోర్స్ సెంటర్‌కు ఆగిరిపల్లి, భీమడోలు, చాట్రాయి, చింతలపూడి, దెందులూరు, ద్వారకా తిరుమల, ఏలూరు మండలాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 6న గణపవరం, నిడమర్రు, నూజివీడు, కైకలూరు, కలిదిండి, లింగపాలెం, మండవల్లి, ముదినేపల్లి, ముసునూరు, పెదపాడు, పెదవేగి, ఉంగుటూరు మండలాల హెచ్‌ఎంలు, 7న జంగారెడ్డిగూడెం ఎంఆర్‌సీకి బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కామవరపుకోట, కొయ్యలగూడెం, కుక్కునూరు, పోలవరం, టి.నర్సాపురం, వేలేరుపాడు మండలాల్లోని పాఠశాలల హెచ్‌ఎంలు హాజరై ఆయా స్కీంలలో విడుదలైన నిధుల వినియోగంపై జరిగే ఆడిట్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఒక్కో స్కూలు నిర్వహణకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా మెయింటెనెన్స్ గ్రాంట్‌ను రూ.12,500ల నుంచి రూ.50వేలు, అంతకు పైబడి ఏటా సమగ్రశిక్ష ద్వారా ప్రభుత్వం విడుదల చేస్తుంటుంది. ఈ నిధులతోనే చాక్‌పీసులు, విద్యుత్ బిల్లులు, ఇంటర్నెట్ కనెక్షన్ బిల్లులు తదితర చెల్లింపులకు ప్రధానోపాధ్యాయులు ఖర్చు చేస్తుంటారు. రెండేళ్లుగా ఈ నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ప్రధానోపాధ్యాయులే సొంతంగా డబ్బులను ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో రూ.కోట్లలోనే మెయింటెనెన్స్ గ్రాంట్ నిధులు బకాయిల రూపంలో హెచ్‌ఎంలకు రీయింబర్స్ కావాల్సి ఉంది. వాస్తవానికి ఏటా విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ఈ గ్రాంట్‌ను విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాలు ఏనాటి నుంచో డిమాండ్ చేస్తుండగా, గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా మెయింటెనెన్స్ గ్రాంట్‌రూపేణా విడుదల చేయలేదని పీఆర్టీయూ, యుటీఎఫ్ జిల్లా నాయకులు ఆంజనేయులు, రవికుమార్ వివరించారు. ఇలా నిధులు విడుదల చేయకుండా ఆడిట్ పేరిట హెచ్‌ఎంలను రికార్డులు, బిల్లులు, ఓచర్లు తీసుకుని ఎంఆర్‌సీలకు రమ్మని ఒత్తిడిచేయడమేంటని ప్రశ్నించారు. ఇది ఉపాధ్యాయులపై, ప్రధానోపాధ్యాయులపై ప్రభుత్వం వేధింపులకు పాల్పడమేనన్న ఆరోపణలు వస్తున్నాయి. మరో వారం రోజుల్లో వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరుచుకోనుండటం, ఈలోగానే వివిధప్రాంతాల్లో వున్న హెచ్‌ఎంలు ఆడిట్ కోసం ఎంఆర్‌సీలకు రావాల్సిందేనని ఒత్తిడి చేయడం సరికాదని ఆంజనేయులు వివరించారు. తక్షణమే ఆడిట్ నిర్వహణ తేదీలను పాఠశాలలు తెరిచేవరకు వాయిదా వేయాలని సోమవారం డీఈవో అబ్రహంను కలుసుకుని పీఆర్టీయూ, యుటీఎఫ్ జిల్లానాయకులు వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు.

### డీఈవో ఏమన్నారంటే..

'స్కూల్ మెయింటెనెన్స్ గ్రాంట్ నిధుల ఆడిట్ 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి జరగడం లేదు. నిధులు విడుదలైన సంవత్సరాలకు సంబంధించి మాత్రమే ఆడిట్ చేస్తారు. గ్రాంట్ నిధులు విడుదల కాకపోతే నిల్ రిపోర్ట్‌గా నమోదు చేస్తారు. దీనికి హెచ్‌ఎంలు అందుబాటులో లేకపోతే అతని తరపున అందుబాటులో వున్న తదుపరి ఉపాధ్యాయుడు ఆడిట్‌కు హాజరయ్యే వెసులుబాటు ఉంది. మెయింటెనెన్స్ గ్రాంట్ నిధుల వినియోగంతో పాటు, నాడు-నేడు కార్యక్రమం రెండు విడతల నిధులు, పీఎం శ్రీ ప్రోగ్రాంకు విడుదలైన నిధుల వినియోగంపై ఆడిట్ జరుగుతుంది.' అని డీఈవో అబ్రహం వివరించారు.

## చేపల చెరువులో మునిగి అన్న,చెల్లెలు దుర్మరణం



అన్న కుమార్,చెల్లెలు వర్షిక మృతదేహాలు

ముదినేపల్లి, జూన్ 3: ముదినేపల్లి శివారు అన్నవరంలో సోమవారం సాయంత్రం విషాదం చోటు చేసుకుంది. ఆ గ్రామంలోని ఒక చేపల చెరువు ఒడ్డుకు ఆడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువు నీటిలో మునిగి అన్నా, చెల్లెలు దుర్మరణం చెందారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదం నింపింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బట్టు సురేష్, రాణి దంపతుల కుమారుడు కుమార్ (7) వర్షిక (4) ఇద్దరు కలిసి తమ ఇంటి వెనుక ఉన్న ఒక చేపల చెరువు ఒడ్డుకు సోమవారం మధ్యాహ్నం ఆడుకునేందుకు వెళ్లారు. కొంతసేపు ఆడుకున్న అనంతరం ఇద్దరు పిల్లలు కనిపించలేదు. సాయంత్రం 4 గంటలకు వర్షిక చెరువులోని నీటిపై తేలుతూ కనిపించింది. అది చూసిన కొందరు వెంటనే చెరువులోకి దిగి ఆ పాపను బయటకు తీశారు. కుమార్ కోసం నీటిలో వెదకగా అతను చెరువు అడుగు భాగంలో కన్పించాడు. ఇద్దరినీ వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే వారు చనిపోయినట్టు వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబం తల్లడిల్లిపోయింది. కుమార్ స్థానిక ప్రైవేట్ స్కూల్లో చదువుతుండగా వర్షిక అంగన్‌వాడీ స్కూల్‌కు వెళ్తోంది. వేసవి సెలవులు కావడంతో ప్రతి రోజూ ఇద్దరు ఇంటి నుంచి బయటకు వెళ్లి ఆడుకుని తిరిగి వచ్చేవారు. సోమవారం కూడా బయటకు వెళ్లిన పిల్లలిద్దరూ విగతజీవులుగా కనిపించడంతో తల్లిదండ్రుల రోదనకు అంతులేకుండా పోయింది.

చెరువులో కూరుకుపోయి బాలుడి మృతి 7



శ్రీవారి ఆలయ హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.15 కోట్లు

ద్వారకాతిరుమల, జూన్ 3: చిన్నతిరుపతిగా ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వర స్వామి ఆలయాల హుండీల లెక్కింపు ద్వారా గడచిన 28 రోజుల కాలానికి రూ.3.15 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రమోద కల్యాణ మండప ఆవరణలో సోమవారం అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీలను లెక్కించారు. హుండీల ద్వారా రూ.3,15,85,574ల నగదుతో పాటు 234 గ్రాముల బంగారం, 7.650 కేజీల వెండి లభించిన ట్లు ఈఓ వి.త్రినాథరావు తెలిపారు. అలాగే రద్దయిన పాతనోట్లు రూ.500 (27), రూ.వెయ్యి (2), రూ.రెండు వేల నోట్ల(13)తో పాటు పలుదేశాల కరెన్సీని భక్తులు కానుకగా సమర్పించారు.

## క్రైం కార్నర్

### చీటీ డబ్బులపై భర్తతో ఘర్షణ.. భార్య ఆత్మహత్య

భీమడోలు జూన్ 3: నలింగంపాడు గ్రామానికి చెందిన గోగులమూడి అరుణ జ్యోతి(35)అనే మహిళ సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకోగా కుటుంబ సభ్యులు చూసి వెంటనే భీమడోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. భీమడోలు పోలీసుల కథనం ప్రకారం 15 ఏళ్ల క్రితం అరుణ జ్యోతికి వివాహం కాగా ఆమె భర్త మద్యానికి బానిసవ డంతో తరచూ తగాదాలు జరుగుతున్నాయి. ఈ నెల రెండో తేదీన చీటీ డబ్బుల విషయమై భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. సోమవారం తెల్లవారుజామున జ్యోతి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా అది చూసిన కుటుంబ సభ్యులు తొలుత భీమడోలు అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై ఆమె సోదరుడు శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చెరువులో మునిగి బాలుడి మృతి



మృతదేహంతో గ్రామస్తుల ఆందోళన

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 3: చెరువులో పడి బాలుడు మృతి చెందిన ఘటన జగన్నాథపురంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి. గ్రామంలో పంచాయతీ చెరువులో చేపలు పట్టేందుకు పెంటపాడుకు చెందిన వారికి కాంట్రాక్టుకు అప్పగించారు. సోమవారం చేపలు పట్టడం పూర్తయిన తరువాత వారిలో ముగ్గురు బాలురు చెరువులో సరదాగా ఆడేందుకు దిగారు. వారిలో రాకేశ్(15) ఊబిలో కూరుకుపోయి ఊపిరాడక కొట్టుకున్నాడు. ఇది చూసిన ఇద్దరు పిల్లలు భయపడి పారిపోయారు. సమాచారం అందించకపోవడంతో రాకేశ్ మృతి చెందాడు. దీంతో బాలుడి మృతదేహంతో బాలుడి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ చేపల చెరువు పట్టేందుకు బాలలను కూలికి తీసుకురావడమేంటని ఈ ఘటన తెలిసిన వారు నిలదీస్తున్నారు.

### వ్యాన్ ఢీకొని యువకుడి దుర్మరణం



మృతి చెందిన సంతోష్

వేలేరుపాడు, జూన్ 3: మోటార్ సైకిల్‌పై ముగ్గురు యువకులు వెళ్తున్న క్రమంలో వ్యాన్ ఢీకొనడంతో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కుక్కునూరు మండలం నెమలిపేటకు చెందిన వర్షా సంతోష్, కటిపల్లి ప్రవీణ్, కంగాల రాము గుబ్బల మంగమ్మ గుడి వద్దకు మోటర్ బైక్‌పై వెళ్తుండగా వేలేరుపాడు మండలం కోయమాధారం గ్రామ శివారులో ఒక వ్యాన్ వెనుక నుంచి ఢీకొనడంతో బైకు నడుపుతున్న వర్షా సంతోష్ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు గాయాలపాల్వడంతో కోయమాధారం గ్రామస్తులు 108కు సమాచారం ఇవ్వగా క్షతగాత్రులను వేలేరుపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన ప్రవీణ్, రాములకు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం పై మృతుని తండ్రి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వేలేరుపాడు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### విద్యుదాఘాతానికి యువకుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 3: విద్యుత్తు షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన ఘటన ఉప్పరగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలివి. ఉప్పరగూడెంకు చెందిన రాపాక బాలు (27) ఇంటర్ పూర్తిచేసి గ్రామంలోనే కిళ్లీ షాపు నడుపుకుంటున్నాడు. సోమవారం సాయంత్రం కోడిగుడ్ల లారీకి తగిలి కేబుల్ వైరు కట్ అయింది. దానిని పక్కకు లాగుదామని బాలు ఆ వైరును పట్టుకోవడంతో కేబుల్ వైరుకు మరో పక్క హైటెన్షన్ వైర్లు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. స్థానికులు సపర్య లు చేసి ఆటోలో ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

### 90 లీటర్ల సారా స్వాధీనం

పోలవరం, జూన్ 3 : ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలీసులు, ఎస్‌ఈబీ అధికారులు మండలంలో పలుచోట్ల దాడులు జరిపి 90 లీటర్ల సారా, 20 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు పోలవరం ఎస్‌ఐ పవన్ కుమార్, ఎస్‌ఈబీ సీఐ కోలా వీరబాబు తెలిపారు. వింజరం పంచాయతీ తానాలకుంటలో బైకుపై సారా తరలిస్తున్న మడకం వరప్రసాద్‌ని అరెస్టు చేసి బైకు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. పోలవరానికి చెందిన బి.సూర్యప్రకాశం వద్ద 30 లీటర్ల సారా, యడ్ల మధుకిరణ్ నుంచి 20 మద్యం బాటిళ్ల, బైకు స్వాధీనం చేసుకుని, ఎల్లండీపేట గ్రామ శివారున సారా తయారీ కేంద్రంపై దాడి చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం బుచ్చియ్యపాలెం గ్రామానికి చెందిన ముద్దరబోయిన శ్రీను అనే వ్యక్తిని అరెస్టు చేసి కేసులు నమోదు చేశామన్నారు. ముద్దాయిలను కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్‌ఈబీ సీఐ వీరబాబు తెలిపారు.

### కోడి పందేల్లో 15 మంది అరెస్ట్



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

ఏలూరు క్రైం, జూన్ 3 : ఏలూరు రూరల్ మండలం పోణంగి సబ్‌స్టేషన్ వద్ద సోమవారం ఉదయం కోడి పందేలు నిర్వహిస్తు న్నట్లు ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్ రాజశేఖర్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు వన్ టౌన్ ఎస్‌ఐ నవీన్ తన సిబ్బందితో సోమవారం ఉదయం దాడి చేశారు. అక్కడ కోడిపందేలు ఆడుతున్న 15 మందిని అరెస్టు చేసి రూ.30 వేల నగదు, ఒక కోడి, 15 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు : ఒకరి మృతి

చిట్యాలరూరల్, జూన్ 3 :జాతీయ రహదారిపై వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. చిట్యాల ఎస్‌ఐ-2 లింగయ్య తెలిపిన వివరాలి. కైకలూరు మండలం భుజబలపట్నంకి చెందిన ఆగు సోమల కుటుంబరావు (42) హైదరాబాద్‌లోని కోమలి ట్రావెల్స్‌లో బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన రాత్రి హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ నుంచి విజయవాడకు ప్రయాణికులతో వెళ్తున్న కోమలి ట్రావెల్స్ బస్సు అర్ధరాత్రి దాటాక గుండ్రాంపల్లి శివారులో పెట్రోల్ బంకు నుంచి లారీ వేగంగా రోడ్డు మీదకు రాడంతో బస్సు అదుపుతప్పి లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న కుటుంబరావుతో పాటు డ్రైవర్ మణికంఠకు గాయాలయ్యాయి. బస్సులోనే ఉన్న మరో డ్రైవర్ నాగేంద్రవరప్రసాద్ ఇద్దరిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కుటుంబరావు మృతి చెందాడు. కుటుంబరావు భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ లింగయ్య పేర్కొన్నారు.

# కాయ్ రాజా కాయ్

- దెందులూరులో దడ పుట్టిస్తున్న పందెంరాయుళ్లు
- చింతమనేని గెలుస్తారని 5 రెట్లు..
- ఎంపీ అభ్యర్థి పుట్టా మహేశ్ గెలుపుపై మూడు రెట్లకు సై
- ఏలూరు జిల్లాలో వైసీపీకి రెండు కూడా రావని పందేలు

దెందులూరు, జూన్ 3 : కౌంటింగ్ వేళ దెందులూరు నియోజకవర్గంలో పందేలు దడ పుట్టిస్తున్నాయి. టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ గెలుపు ఖాయమని ఒకటికి ఐదు రెట్లు పందెం కాయడం చర్చనీయాంశంగా మారింది. టీడీపీ నేతలు రూ.ఐదు లక్షలు పందెం కాయగా వైసీపీ నాయకులు రూ.లక్ష పందెం కాశారు. మండలంలోని పెరుగుగూడెం, గోపన్నపాలెం, గాలాయగూడెం, చల్లచింతలపూడి, రామారావుగూడెం, మేదినరావుపాలెం, దెందులూరు, శ్రీరామవరంతోపాటు దాదాపు అన్ని గ్రామాల్లో టీడీపీ గెలుస్తుందని, చింతమనేని గెలుస్తారంటూ హెచ్చు పందేలు పెద్ద ఎత్తున సోమవారం సాయంత్రం వరకు కాశారు. ఒక మెట్ట గ్రామంలో యువనేత చేతిలో డబ్బు లేకపోవడంతో తనకు చెందిన ఒక ఎకరం పట్టదారు పాసు పుస్తకాన్ని తనఖా పెట్టి రూ.మూడు లక్షలు తీసుకుని చింతమనేని గెలుపుపై పందెం కాశారు. ప్రతి గ్రామంలో చిన్నస్థాయి కార్యకర్తలు సైతం రూ.పది వేల నుంచి రూ.10 లక్షల వరకు పందేలు కాస్తున్నారు.

పెదవేగి మండలంలో టీడీపీకి మెజార్టీ వస్తుందని కొందరు, దెందులూరు మండలంలో టీడీపీకి 1500 మెజార్టీ వస్తుందని ఇంకొందరు, ఐదు వేల ఓట్లతో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అబ్బయ్యచౌదరి గెలుస్తారని మరికొందరు పందేలు వేశారు. ఇంత పెద్ద స్థాయిలో కాయడం గతంలో ఎప్పుడు జరగలేదు. సర్వేలతో తమకు పని లేదు, ఎమ్మెల్యేగా చింతమనేని, ఏలూరు ఎంపీగా పుట్టా మహేశ్‌యాదవ్, సీఎంగా చంద్రబాబు గెలుపు ఖాయమంటూ టీడీపీ తరఫున పందెం కాసేవారు గెలుపుపై దీమాతో వైసీపీ తరఫున పందెం కాసేవారికి




ముందస్తుగానే ఫోన్ పే ద్వారా నగదు బదిలీ చేసి సవాల్ విసరడం గమనార్హం.

## కమీషన్‌రాయుళ్లకు పండుగ

ఉంగుటూరు : కాదేది పందేనికనర్హం అంటూ క్రికెట్ బుకీలు సంబర పడుతున్నారు. ఐపీఎల్ క్రికెట్ పోటీలు ముగియడంతో బుకీల కన్ను ఎన్నికల ఫలితాలపై పడింది. ఎక్కడికక్కడ పందేలకు తెర తీశారు. పిఠాపురం నుంచి పవన్ కల్యాణ్ గెలుపుపై, సీఎం ఎవరవుతారనే విషయమై బెట్టింగ్ రాయుళ్ల పందేలు కాయిస్తున్నారు. పందెం రాయుళ్ల తొలుత సమ పందేలు, పోలింగ్ సరళిని చూసి ఒకటికి ఒకటిన్నర పందేలతోపాటు మూడు రెట్ల పందేలు జరిగాయి. కొందరు ఐదు శాతం కమిషన్ ప్రాతిపదికన పందెంరాయుళ్ల నుంచి వసూలు చేస్తున్నారు. కైకరం, ఉంగుటూరు, నారాయణపురం తదితర గ్రామాల్లోని పందెం రాయుళ్లంతా బుకీలు ఉండడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కైకరంలో ఒక ప్రజా ప్రతినిధి వైసీపీ గెలుస్తుందని భారీ మొత్తంలో పందెం కాయడంతో అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అక్కుపల్లి గోకవరంలో ఒకవ్యక్తి పెద్దఎత్తున కమిషన్ ప్రాతిపదికన పందేలను స్వీకరించినట్లు తెలిసింది.

## బాబుపై 3 లక్షలు.. జగన్‌పై లక్ష

పెదవేగి : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఒక్కరోజు సమయం మాత్రమే ఉండడంతో బెట్టింగ్ రాయుళ్ల మరింత జోష్‌తో పందేలకు ఎగబడుతున్నారు. పందేల కోసం ఒకటికి రెండు అంటూ ఆఫర్లను ప్రకటిస్తున్నారు. నిన్నటి వరకు ఒక ఎత్తు కాగా, ఓట్ల లెక్కింపునకు ఒక రోజు ముందు పందెలరాయుళ్ల మరింత స్పీడు పెంచి పందెం కోసం కవ్విస్తున్నారు. మీ పార్టీ గెలుస్తుందనే నమ్మకం ఉన్నప్పుడు పందేలు కాయండి అంటూ ప్రత్యర్థులు పందేలు కాసేలా రెచ్చగొడుతున్నారు. దీంతో పందేలు ఒడ్డడానికి కొంతమంది సిద్ధపడుతున్నారు. సోమవారం జరిగిన పందేల్లో సీఎంగా చంద్రబాబునాయుడు అవుతారని ఒక వర్గం రూ.3 లక్షలు కాయగా జగన్ సీఎం అవుతారని వేరొక వర్గం రూ.లక్షగా పందేలు జోరుగా సాగాయి. దీంతోపాటు స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపుపైనా పందేలు ముమ్మరంగా సాగాయి. పందేల సొమ్మును మధ్యవర్తి దగ్గర పెట్టినందుకు మధ్యవర్తికి పందెం సొమ్ములో ఐదు శాతం ఇచ్చేలా ఒప్పందాలు జరుగుతున్నాయి.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల మక్కువ

గణపవరం : ఇంకా తెల్లవారలేదే... ఈ చీకటి విడిపోలేదే అంటూ ఈ నెల 4వ తేదీ ఓట్ల లెక్కింపులో గెలుపెవరిది అంటూ సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఫలితాలపై అందరి దృష్టి మళ్లింది. అభ్యర్థులతో పాటు పందెంరాయుళ్లతో సహా విడని ఉత్కంఠ చోటు చేసుకుంది. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని వైసీపీ అధికారంలోకి వస్తుందని మరికొందరూ అంతిమ దశలో పందేలు కాయడం విశేషం. హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, పుణె తదితర నగరాల్లో స్థిరపడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అధికంగా పందేలు కాస్తున్నారు. ముఖ్యంగా విదేశాల్లో ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎన్నడూ లేని విధంగా ఈసారి ఇక్కడ తమ బంధువులకు ఫోన్ చేసి పందేలకు వైసీపీ వాళ్లు ఎవరైనా ఉన్నారా? అంటూ ఆరా తీస్తున్నారు. రాష్ట్రం, జిల్లాల్లో, వైసీపీకి ఎన్ని సీట్లు వస్తాయని ఆరా తీస్తున్నారు. మంగళవారం ఈ ఉత్కంఠకు తెరపడనుంది.

# కూటమి గెలుపుపై పూజలు

కూటమి అభ్యర్థులు విజయం సాధించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పలు ఆలయాలలో పూజలు చేశారు. ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని, నిరుద్యోగం పెరిగిపోయిందని చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం తిరిగి అభివృద్ధి దిశగా పయనించి ప్రజలు సుభిక్షంగా ఉంటారని వారు దేవుళ్లకు విన్నపాలు చేసుకుంటూ మొక్కులు చెల్లించుకుంటున్నారు.



సోమేశ్వరస్వామికి కొబ్బరి కాయలు కొడుతున్న నాయకులు

భీమవరం టౌన్, జూన్ 3 : నరసాపురం ఎంపీతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని కోరుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సోమవారం గునుపూడి పంచారామక్షేత్రమైన ఉమాసోమేశ్వర, జనార్దనస్వామి దేవస్థానంలోని సోమేశ్వరస్వామికి 108 కొబ్బరి కాయలు కొట్టి అభిషేకాలు చేయించారు. సీఎంగా చంద్రబాబు నాయుడు, 21 సీట్లతో పవన్ కల్యాణ్ అత్యధిక మెజార్టీలతో విజయం సాధించాలని, పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మంత్రి కావాలని పూజలు చేశారు. చెరుకూరు రామకృష్ణచౌదరి ఆధ్వర్యంలో జిల్లా గౌడ్ సంఘం అధ్యక్షుడు వీరమల్లు సూరిబాబు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువత కార్యదర్శి పండు, నియోజకవర్గం తెలుగు యువత కార్యదర్శి కాసాని రామాంజనేయులు, గునుపూడి లాయర్ శ్రీను, రెడ్డి సత్తిబాబు, పెద్ది రాజు, చినరంగనిపాలెం సోమరాజు, యూత్ సభ్యులు వీరమల్లు వెంకట్, తదితరులు పాల్గొన్నారు





విజయగణపతి స్వామికి పూజలు చేస్తున్న చంటి, పరింపూడి అర్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

- ఏలూరు కార్పొరేషన్ : ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కూటమి ఏలూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బడేటి వెంకట్రామయ్య(చంటి) అనుచర బృందంతో వెళ్లి పవరుపేటలోని విజయ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి గరికతో అర్చనలు జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు. ఎన్నికల్లో విజయం చేకూర్చాలంటూ చంటి, అనుచర బృందం స్వామివారిని ఆరాధించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు చంటి వెంట ఉన్నారు.



కాలినడకన చినతిరుపతి వెళ్తున్న నాయకులు

- తాడేపల్లిగూడెం రూరల్ : కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, రాష్ట్రంలో కూటమి గెలుపును కాంక్షిస్తూ కడియద్ద కూటమి నాయకులు కాలినడకన చిన్నతిరుపతి వెళ్లారు. వీరిని జనసేన, టీడీపీ నాయకులు బొలిశెట్టి రాజేష్, తోట రాజా అభినందించారు. టీడీపీ, జనసేన, బీజేపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.
- కొయ్యలగూడెం : కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని తెలుగు మహిళా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. పరింపూడి రామాలయం, అర్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికల ఫలితాలు కూటమికి అనుకూలంగా రావాలంటూ పూజలు చేసినట్లు ఆమె తెలిపారు. టీడీపీ నాయకులు రమా, సిర్రా ఉమా, కర్రి లక్ష్మీదేవి, సూరి భార్గవి, తదితరులు ఉన్నారు.

# ఉత్తమ ప్రదర్శనగా ఇంద్ర ప్రస్థం

## ముగిసిన నాటిక పోటీలు



ఉత్తమ ప్రదర్శన 'ఇంద్ర ప్రస్థానం' నాటికకు బహుమతి అందజేస్తున్న సభ్యులు

భీమవరం అర్బన్, మే 3: చైతన్య భారతి సంగీత నృత్య నాటక పరిషత్ జాతీయ స్థాయిలో నిర్వహించిన నాటిక పోటీల్లో అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి 'ఇంద్రప్రస్థం' నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపిక కాగా, తెలుగు కళా సమితి విశాఖపట్నం వారి 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' ద్వితీయ స్థానం, చైతన్య కళాభారతి కరీంనగర్ వారి 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక తృతీయ స్థానం సాధించాయని చైతన్య భారతి అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ తెలిపారు. జ్యూరీ ప్రదర్శనగా కళాంజలి హైదరాబాద్ వారి 'రైతే రాజు', ఉత్తమ రచన 'మూల్యం' రచయిత సింహ ప్రసాద్, ఉత్తమ దర్శకత్వం ఎస్.రవీంద్ర రెడ్డి, ఉత్త నటుడు కుమార్ పాత్రదారి సి.వరప్రసాద్ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత), ఉత్తమ నటి చుక్కమ్మ పాత్రదారిణి నాగ రాణి(విముక్తి), ఉత్తమ ప్రతి నాయకురాలుగా సరిత (ఎనిమి), ఉత్తమ హాస్యనటుడిగా వి.సురేష్ (ఎనిమి), ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కె.సూర్యనారాయణ (స్వప్నం రాల్చిన అమృతం) ఉత్తమ క్యారెక్టర్ నటిగా వసంత యామిని (మనస్విని), సంగీతం (ఇంద్రప్రస్థం) ఉత్తమ మేకప్ మనస్విని, ఉత్తమ లైటింగ్ కౌసల్య సుప్రజ రామా, జ్యూరి బహుమతి శ్రావ్య, కావ్య (ఎనిమి) సాయి, సుప్రీయ (స్వప్నం రాల్చిన అమృతం)కు అందించామని వివరించారు. ఈ కార్యక్రమంలో రాయప్రోలు భగవాన్, శ్రీనివాస మూర్తి, కట్రేడ్డి సత్యనారాయణ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, బోండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, కాగిత వేంకటరమణ, బీశెట్టి జ్యోతిరాజ్, నడింపల్లి మహేష్, న్యాయ నిర్ణేతలుగా మానాపురం సత్యనారాయణ, డాక్టర్ ఎన్‌వీ కృష్ణారావు, పంపన దయానంద బాబు వ్యవహరించారు.

## 'భవిష్యత్ త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ దే'



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 3 : భవిష్యత్ త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ దేనని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. ఏపీ నిట్‌లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ పై 8, 9, 10 తరగతి విద్యార్థులకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న రంగాలలో త్రీడి ప్రింటింగ్ ఒకటన్నారు. ఈ టెక్నాలజీని ఉపయోగించి వివిధ రకాల నాణ్యమైన వస్తువులు, బొమ్మలు, భవనాలు, వంతెనల వంటివి నచ్చిన డిజైన్లలో ఎంతో ఆకర్షణీయంగా రూపకల్పన చేయవచ్చన్నారు. విద్యార్థులు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై నైపుణ్యాలను పెంపొందించుకుని అంకుర పరిశ్రమలను ఏర్పాటు చేసే స్థాయికి ఎదగాలన్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సులపై పట్టు సాధించడంతో పాటు అన్ని రంగాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.బాబూరావు మాట్లాడుతూ విద్యార్థులు త్రీడీ ప్రింటింగ్ అప్లికేషన్లు, మెళకువలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమానికి కో ఆర్డినేటర్‌గా డాక్టర్ టి.కార్తికేయశర్మ వ్యవహరించగా, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ పి.శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



బస్టాండ్‌లో తొలగిస్తున్న అక్రమణలు

పాలకొల్లు అర్బన్, జూన్ 3 : బస్టాండ్ రోడ్డులోనూ బస్టాండ్ చేర్చి ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ ముందు చేప ట్టిన డ్రైనేజీలపై అక్రమణలను మూడో రోజు సోమవారం కూడా తొలగింపు కొనసాగించారు. చిన్న పాటి వర్షానికే బస్టాండ్ ఆవరణ మునిగిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. తమకు సమయం ఇవ్వకుండా అధికారులు చేపట్టిన అక్రమణల తొలగింపుతో తాము వ్యాపారాలు కోల్పోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని షాపింగ్ కాంప్లెక్ వ్యాపారులు వాపోతున్నారు. మున్సిపల్ కమిషనర్ విజయసారధి ఆదేశాలతో ఆర్‌ఐ శ్రీనివాసరాజు, టీపీవో బ్రహ్మం, టీపీఎస్ త్రినాధరావు సిబ్బంది అక్రమణలు తొలగించే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

### తాళాలు పగులగొట్టి ఇంట్లో చోరీ

పెదవేగి, జూన్ 3 : ఇంటికి తాళం వేసి, ఊరువెళ్లి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. పెదవేగి ఎస్‌ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భోగాపురం శివారు ప్రకాష్‌నగర్(వైర్లు)కు చెందిన గాదిరాజు గంగరాజు వారం రోజుల కిందట ఇంటికి తాళం వేసి, కుటుంబ సభ్యులతో కలిసి గ్రామాంతరం వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో పరిశీలించగా బీరువాలోని 15 కాసుల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరణకు గురయ్యాయి. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని, క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించామని ఎస్‌ఐ చెప్పారు.

### యువకుడిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 3 : నిద్రిస్తున్న ఒక మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఒక యువకుడిపై కేసు నమోదైంది. ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన మహిళ (52) సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుంది. ఏలూరు బంగారునాగన్న వీధికి చెందిన బంగారు విద్యాసాగర్ అనే యువకుడు అర్ధరాత్రి ఇంట్లోకి ప్రవేశించి ఆ మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు టూ టౌన్ పోలీసులు ఆ యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆక్వాకు విద్యుత్ షాక్

- ఏరియేటర్లు పని చేయక ఆక్సిజన్ లోపం
- రొయ్యల మృత్యువాత
- లక్షల్లో నష్టం.. జనరేటర్ల ఏర్పాటుతో అదనపు భారం



చేపల చెరువులో తిప్పుతున్న బోటు

కలిదిండి, జూన్ 3 : ఆక్వా సాగు రైతులకు భారంగా మారుతోంది. ఒకవైపు వాతావరణం అనుకూలించకపోవడం, మరో వైపు అప్రకటిత విద్యుత్ కోతలతో రొయ్యలు, చేపలు మృత్యువాత పడుతుండడంతో లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. వాతావరణంలో మార్పులతో చిరుజల్లు పడడంతోపాటు ఉక్కబోతతో చెరువుల్లో ఆక్సిజన్ లోపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో చెరువుల్లో నిరంతరాయంగా ఏరియేటర్లు తిరుగుతూనే ఉండాలి. అయితే గంటల తరబడి విద్యుత్ కోతల కారణంగా ఏరియేటర్లు పని చేయక చెరువుల్లో ఆక్సిజన్ లోపించి రొయ్యలు మృత్యువాత పడడంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యామ్నాయంగా జనరేటర్లు అద్దెకు ఏర్పాటు చేసుకోవడానికి రైతులందరూ ఎగబడటంతో వాటికి డిమాండ్ పెరిగింది. రాత్రి వేళల్లో విద్యుత్ కోత విధిస్తుండడంతో చెరువుల వద్ద అద్దె జనరేటర్లు ఏర్పాటు చేసి ఏరియేటర్లను తిప్పుతున్నారు. పండుగప్ప చెరువుల్లో కూడా ఆక్సిజన్ కొరత ఏర్పడకుండా నిరంతరాయంగా ఏరియేటర్లు తిప్పుతున్నారు. ఆక్సిజన్ లోపిస్తే పండుగప్ప చనిపోయే ప్రమాదముంది. మట్టగుంటలో ఇటీవల సుమారు ఏడేకరాల చెరువుల్లో ఆక్సిజన్ లోపించి పండుగప్పలు మృత్యువాత పడడంతో రైతులకు రూ.70 లక్షల నష్టం వాటిల్లింది. అలాగే పెదలంకలో ఓ రైతుకు చెందిన ఐదేకరాల చెరువులో ఆక్సిజన్ కొరత ఏర్పడి వనామి రొయ్యలు చనిపోవడంతో రూ.10 లక్షలు నష్టం వచ్చింది. కరెంట్ ఎప్పుడు ఉంటుందో తెలియని పరిస్థితి ఉండడంతో రేయింబవళ్లు చేపలు, రొయ్యల చెరువుల వద్ద ఆక్వా రైతులు కాపల ఉంటున్నారు. కరెంట్ పోగానే ఏరియేటర్లకు జనరేటర్ కనెక్షన్ ఇస్తున్నారు. చేపల చెరువుల్లో ఆయిలింజన్లను బోటులో అమర్చి తిప్పుతున్నారు. దీంతో చెరువులో కెరటాలు రావడంతో ఆక్సిజన్ ఉత్పన్నమవుతోంది. విద్యుత్ కోత సమయాలను విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించాలని పలువురు కోరుతున్నారు.

### సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 3 : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన ఓఎస్ఎస్‌సీ సంస్కృతం పేపర్-2 పరీక్షకు జిల్లాలో 17 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 15 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షతో సప్లిమెంటరీ పరీక్షలు పూర్తిగా ముగిశాయని, జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

#### దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షకు 19 మంది గైర్హాజరు

ఏపీ ఓపెన్ స్కూల్స్ దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ జీవశాస్త్రం పరీక్షలకు జిల్లాలో 100 మంది, వాణిజ్యశాస్త్రం పరీక్షకు 148 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో తెలిపారు. మొత్తం 19 మంది గైర్హాజరయ్యారని వివరించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

### అకడమిక్ భవనం పరిశీలన

నూజివీడు, జూన్ 3: నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలేజ్ ఆఫ్ పీజీ స్టడీస్‌లో నూతనంగా నిర్మాణంలో ఉన్న అకడమిక్ భవనాన్ని కృష్ణా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జ్ఞానమణి, ఎడ్యుకేషన్, వెల్ఫేర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దివాన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు.



## వేడుకగా మాచేనమ్మ జాతర

ఆచంట, జూన్ 3: ప్రశిద్ధి చెందిన పెదమల్లం మాచేనమ్మ, పల్లాలమ్మ అమ్మవార్ల జాతర వేడుకగా నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి చిన్న జాతర మహోత్సవం వేడుకగా జరిగింది. ఈ జాతరలో గరగనృత్యాలు, డప్పు వాయిద్యాలు ఆకర్షించాయి.

## అన్నసమారాధన

ఆచంట, జూన్ 3: ఆచంటలో పుంతల ముసలమ్మ జాతరలో భాగంగా సోమవారం అమ్మవారి ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## దేశాలమ్మకు లక్ష మల్లెల పూజలు



పాలకొల్లు అర్బన్, జూన్ 3 : చింతల తోటలో దేశాలమ్మ జాతర ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి అమ్మవారికి లక్ష మల్లెల పూజలు నిర్వహించారు. మే నెల 27వ తేదీ నుంచి జాతర ఉత్సవాలు జరుగుతున్న విషయం విదితమే. పట్టణానికి చెందిన మజ్జి దుర్గా సత్యేంద్ర, లక్ష్మీ దంపతులు ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ వలిరెడ్డి వరహాలు, కార్యదర్శి శిడగం చంద్రశేఖర్ (చందు) పాల్గొన్నారు.

## ప్రపంచ సైకిల్ దినోత్సవం



విద్యార్థినికి సైకిల్ అందిస్తున్న దృశ్యం

పాలకొల్లు టౌన్, జూన్ 3: పాలకొల్లు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్షీరపురి యోగా సత్సంగం సభ్యులు సోమవారం ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుదాకరరావు మాట్లాడుతూ సైకిల్ తొక్కడం ద్వారా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని రక్షించవచ్చునన్నారు. బీవీఆర్ఎం బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పేద విద్యార్థిని గీతాభవానికి కొత్త సైకిల్‌ను అందించారు. ఈకార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్‌సాహెబ్, యోగా కేంద్రం నిర్వాహకుడు జవ్వాజి కళ్యాణ్, పూర్వ గవర్నర్ ఆకి రామకృష్ణ, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు పాల్గొన్నారు.

## కౌంటింగ్‌లో హుందాగా వ్యవహరిద్దాం



ఏజెంట్లతో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి రఘురామ

ఉండి, జూన్ 3: కౌంటింగ్ ఏజెంట్లు నియమ నిబద్ధతతో వ్యవహరించాలని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మంతెన రామరాజు, ఉండి టీడీపీ అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. సోమవారం భీమవరంలో ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కౌంటింగ్‌లో హుందాగా వ్యవహరిద్దామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్తపల్లి నాగరాజు, ఉండి టీడీపీ పరిశీలకుడు నాగేంద్రకుమార్, ఉండి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జు జుత్తుగ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే శివ గోదానం



కాళ్ల(ఉండి) జూన్ 3: మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు అరుణకుమారి దంపతులు కలువపూడిలోని ఆయన స్వగ్రామంలో కాళ్ల మండలం కలువపూడిలో గోదానం చేశారు. కలువపూడి పల్లిపాలెంలలో శ్రీకనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు రోజుల క్రితం ఉత్తరాంధ్రలో పలు ఆలయాలను శివ సందర్శించారు.

## విద్యార్థినికి టీడీపీ సైకిల్ వితరణ

తణుకు, జూన్ 3: చదువులో రాణించి అభివృద్ధి సాధించాలని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో పట్టణంలో 23వ వార్డుకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సహకారంతో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఇంటర్ విద్యార్థిని కోర్లేపర్ల సునయన సాయిలక్ష్మికి సైకిల్‌ను ఆరిమిల్లి బహూకరించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## 272 స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు



బస్సు ఫిట్‌నెస్ పరీక్షిస్తున్న ఎంవీఐ సురేంద్రసింగ్ నాయక్

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 3: పాఠ శాల బస్సులను ఫిట్‌గా ఉంచడం వల్ల ప్రమాదా లను నివారించవచ్చని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రసింగ్ నాయక్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని కార్యాలయంలో సోమవారం స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు జారీచేశారు. ఈ సందర్భంగా 320 స్కూల్ బస్సులు ఈ ఫిట్‌నెస్‌లో పాల్గొనగా 272 బస్సులకు సర్టిఫికెట్‌లు జారీ చేశారు. మరో 48 బస్సులకు మరమ్మతులు చేయించాలని సూచించారు.

## దోమల నివారణతో మలేరియాకు చెక్



ర్యాలీ ప్రారంభిస్తున్న శ్రీహర్ష

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 3: దోమలను నివారించడం ద్వారా మలేరియా రాకుండా జాగ్రత్త పడవచ్చని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీహర్ష పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీలో మలేరియా మాసోత్స వాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో సూర్యకాంతం, హెచ్‌వీ జ్యోతి, హెచ్ఎస్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మందులు అందుబాటులో ఉంచుతాం

అత్తిలి, జూన్ 3 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మందులు అందుబాటులో ఉంచుతామని తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఎంబీఎస్ ప్రమోద కుమారి తెలిపారు. అంగన్వాడీల్లో మందుల్లేవ్.. శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. చిన్నారులకు ఉపయోగపడే మందులను అందుబాటులో ఉంచుతామని ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు.

# నేడే ఓట్ల లెక్కింపు.. సర్వత్రా ఉత్కంఠ

### భీమవరంలో పూర్తి స్థాయిలో అధికారుల ఏర్పాట్లు

ఆచంట, జూన్ 3: ఆచంట నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ మంగళవారం భీమవరం విష్ణు కళాశాలలో జరగనుంది. కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ, వైసీపీ అభ్యర్థి రంగనాధ రాజు మధ్య హోరా హోరీగా ఎన్నిక జరిగింది. ఆచంట నుంచి మొత్తం 9 మంది పోటీ చేయగా పితాని, రంగనాధరాజు మధనే పోటీ నెలకొంది. ఆచంట నియోజకవర్గంలో లక్షా 80 వేల 17 ఓట్లు గాను లక్షా 48 వేల 986 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 82.76 శాతం పోలింగ్ శాతం నమోదు అయ్యింది.

**ఉండి/ఆకివీడు:** ఉండి నియోజకవర్గ ఓట్ల లెక్కింపుకు సర్వ సిద్ధం చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టరు, ఉండి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. సోమవారం భీమవరంలోని ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని కేంద్రాలను ఆయన పరిశీలించారు. 17రౌండ్లలో ఉండి అసెంబ్లీ నియోజకవర్గం ఫలితం వెలువడుతుందన్నారు. తొలుత ఆకివీడు మండలం పెదకాపవరం ఒకటో పోలింగ్ బూత్ నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమై కాళ్ల మండలం మాలవానితిప్ప 238 పోలింగ్ బూత్‌తో ముగుస్తుందన్నారు. నియోజకవర్గంలో 2,24,725మంది ఓట్లుకు గాను 1,93,783 ఓట్లు పోలయ్యాయి. 86.20 శాతం నమోదు అయ్యింది.

**తణుకు:** తణుకు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల కౌంటింగ్ సంబంధించి భీమవరంలోని విష్ణు ఇంజనీరింగ్ కాలేజిలో నిర్వహిస్తారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజక వర్గంలో 2 లక్షల 34 వేల 575 మంది ఓటర్లుం డగా లక్ష 94 వేల 857 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ 2 వేల 298 మంది వినియోగించుకు న్నారు. ఇవి ఇంకా పెరిగే అవకాశం ఉంది. మొత్తంగా పోలైన ఓట్లకు సంబంధించి 17 రౌండ్లు లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు.

**తాడేపల్లిగూడెం అర్బన్:** తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో మొత్తం 2,14,985 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,75,990 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 81.86గా నమోదైంది. ఓటు వినియోగించుకున్న వారిలో పురుషులు 87,208 మంది, స్త్రీలు 88,773 మంది, ఇతరులు 9 మంది ఉన్నారు. పోస్టల్ బ్యాలెట్ 1895 మంది వినియోగించుకున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో నిర్వహిస్తారు. నియోజకవర్గానికి 14 టేబుల్స్‌ను అధికారులు సిద్ధం చేశారు.





ఎస్ఆర్‌కెఆర్ కళాశాలలో ఈవీఎంలను భద్రంగా వుంచిన స్ట్రాంగ్ రూమ్

## పుస్తక పఠనంతో విజ్ఞానం

నరసాపురం టౌన్, జూన్ 3: విద్యార్థులు చిన్నతనం నుంచి కొద్దిసేపు పుస్తక పఠనం చేయడం వల్ల విజ్ఞానం పెరుగుతుందని రోటరీక్లబ్ అధ్యక్షురాలు జి. సత్యవతి అన్నారు. సోమవారం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆమె సందర్శించారు. చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో లైబ్రేరీ అధికారి కుమారి, తోట శ్రీనివాస్, టి.కృష్ణ, బి.కృష్ణమూర్తి, సీహెచ్ శ్రీనివాస్, సుధీర్, సూర్యంబాబు పాల్గొన్నారు

## చినలంక వంతెన నిర్మించాలి

నరసాపురం రూరల్, జూన్ 3: చినలంక గ్రామంలో కూలిపోయిన వంతెనను నిర్మించాలని తీర ప్రాంత వాసులు కోరుతున్నారు. ఈ వంతెన కూలడం వల్ల సముద్రం నుంచి మత్స్య సంపద తెచ్చుకునేందుకు మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వంతెన నిర్మాణ పనులకు నిధులు మంజూరు అయినా పనులు మాత్రం నోచుకోలేదు. ఇటు సముద్ర ఆటుపోట్లకు నల్లిక్రీక్ మురుగు లాగకపోవడం వల్ల సమీప ఆక్వా చెరువులు ముంపుబారిన పడుతున్నాయి. అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు

## పాఠ్యపుస్తకాలు సిద్ధం



స్టాక్ పాయింట్ వద్ద ఉపాధ్యాయులు

మొగల్తూరు, జూన్ 3: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు సిద్ధమవుతున్నాయి. పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో సంబంధిత విద్యాశాఖాధికారులు కృషి చేస్తున్నారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో 8వ తేదీ నాటికే పాఠ్యపుస్తకాలు పాఠశాలలకు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో 1 నుంచి 10వ తరగతి వరకు సుమారు 46,130 పాఠ్యపుస్తకాలు ఇండెంట్ పెట్టగా మొదటి విడతగా ఇప్పటి వరకు 27,585 పుస్తకాలు వచ్చాయని ఎంఈవో శ్యామ్యూల్ జాన్ తెలిపారు. మిగిలిన పుస్తకాలు త్వరలో రానున్నాయని పాఠశాలలు ప్రారంభించే సమయానికి ముందుగానే ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు అందచేయడం జరుగుతుందన్నారు. అలాగే బ్యాగ్‌లు 4843, డిక్షనరీలు 879 రావల్సి ఉండగా బెల్టులు మాత్రం 3272 వచ్చాయన్నారు.

## పింఛన్‌ల పంపిణీ పూర్తి



శేరేపాలెంలో పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

మొగల్తూరు, జూన్ 3: ఎన్నికల కోడ్ కొనసాగుతుండటంతో ఈనెల సామాజిక పింఛన్‌లు కూడా ఇంటి వద్ద నేరుగా, మరికొందరికి బ్యాంకు ఖాతాల ద్వారా లబ్ధిదారులకు అందించడం జరిగిందని అధికారులు తెలిపారు. మొగల్తూరు మండలంలో 17 గ్రామాలకు సంబంధించి 3265 మంది లబ్ధిదారులకు ఇంటి వద్ద ఈనెల 1నుంచి 3వ తేదీ వరకు పింఛన్‌లు అందించామని ఎంపీడీవో బాబ్జిరాజు తెలిపారు. బ్యాంకు ఖాతాలో 7534 మందికి జమచేయాల్సి ఉండగా 7525 మందికి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి ఏమైనా ఇబ్బందులు వస్తే వాటిని పరిష్కరించి వారి ఖాతాలో జమ అయ్యేటట్టు చూస్తామని ఎంపీడీవో తెలిపారు.

## వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గణపవరం, జూన్ 3: వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, ఇందుకు సైక్లింగ్ కూడా ఎంతో ఉపయోగపడు తుందని వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, మొక్కల మాస్టారుగా పిలువబడే అల్లూరి గంగరాజు అన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరగంట సైకిల్ తొక్కితే 200 కేలరీలు తగ్గుతాయని, కండరాల సామర్థ్యం పెరుగుతుందన్నారు. మధుమేహం, బీపీ లాంటి వ్యాధులు అదుపులో ఉంటాయన్నారు. జిమ్ నిర్వాహకులు కూడా సైకిల్ తొక్కమంటారన్నారు.

## పింఛన్‌దారులకు తప్పని పాట్లు



అర్ధవరం బ్యాంకు వద్ద పింఛన్‌దారులు

గణపవరం, జూన్ 3: ప్రభుత్వం జూన్ పించన్లు కూడా బ్యాంకు అకౌంట్లలో జమ చేయడంతో గణపవరం మండల బ్యాంకుల వద్ద సోమవారం కూడా పింఛన్ కోసం పడిగాపులు కాశారు. గణపవరం, పిప్పర, అర్ధవరం బ్యాంకులు పింఛన్‌దారులతో కిటకిటలాడాయి. దీంతో అధికారులు తలలు పట్టుకున్నారు. ఒక పక్క ఉక్కపోతతో పింఛన్‌దారులు అల్లాడిపోయారు.

## పోలీసు 30 యాక్టు, 144 సెక్షన్ అమలు

ఆకివీడు, జూన్ 3: పోలీస్ 30 యాక్టు, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున వీధుల్లో ముగ్గురు వ్యక్తులు కలిసి తిరగరాదని ఎస్ఐ బత్తిన నాగబాబు అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పనిపాట లేకుండా ఎవరూ తిరగరాదన్నారు.ముగ్గురు వ్యక్తులు కలిసి తిరగడానికి వీలులేదని అంతే కాకుండా గుంపులుగా తిరిగితే చట్ట పరమైన చర్యలకు బాధ్యులగుతారని హెచ్చరించారు. కొట్లాటకు తావుండకూడదన్నారు. మద్యం అమ్మడానికి వీలులేదన్నారు. ర్యాలీలు చేయడానికి అనుమతులలు లేవని, మందుగుండు సామగ్రి కాల్చరాదన్నారు. సోషల్ మీడియాలో ఒకరు పార్టీపై ఒకరు రెచ్చగొట్టుకొనే పోస్టులు పెట్టరాదన్నారు. మోటారు వాహనాలు సౌండ్లతో అసలు తిరగరాదన్నారు.

## నేడు దుకాణాలు తెరవొద్దు



నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్

ఆకివీడు, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరుగుతున్నందున పట్టణ పరిధిలో దుకాణాలు తెరవడానికి వీలులేదని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎవరైనా దుకాణాలు తెరిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులగుదురని హెచ్చరించారు. ఉదయం ఎనిమిది గంటలు వరకూ టిఫెన్లు దుకాణాలు అ మ్మకాలు జరుపుకోవచ్చునన్నారు.

## బెరమ్స్ మరచిన కాంట్రాక్టర్లు

### ప్రమాదాలకు నిలయంగా రహదారులు



ఆకివీడు, జూన్ 3: గ్రామాల్లో డాంబర్ రోడ్లు వేసి సైడ్ బెరమ్స్ మరచడంతో రహదారులు ప్రమాదాలకు నిలయమయ్యాయి. అజ్జమూరు గొడౌన్ నుంచి కుప్పనపూడి సెంటర్ వరకూ ఇటీవల డాంబర్ రోడ్ వేశారు. నెలలు గడుస్తున్నా సైడ్ బెరమ్స్ వేయకపోవడంతో ఇటీవల వృద్ధురాలిని మట్టి లారీ ఢీకొని మరణించింది. మరో రోజు చేపల లోడ్ లారీ స్కిడ్ అయింది. ఇలా రోజూ ఏదో ఒకటి జరుగుతూనే ఉంటుంది. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

## 6వ తేదీ వరకు ఎన్నికల నియమావళి

ఉండి, జూన్ 3: జిల్లాలో ఈనెల 6వ తేదీ వరకు ఎన్నికల నియమావళి అమలులో వుంటుందని ఆర్వో ప్రవీణ్ తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ఏజెంట్లు, అభ్యర్థులు ఎవరైనా గొడవలు, అల్లర్లు సృష్టించాలని చూస్తే ఎవరినైనా ఉపేక్షించమని పరిధి దాటిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, లెక్కింపు కేంద్రం నుంచి బయటకు పంపించి వేస్తామని అవసరమైతే అరెస్ట్ చేయడానికి కూడా వెనకడుగు వేసే ప్రసక్తిలేదన్నారు.

## ధూమపానంతో క్యాన్సర్

తణుకు, జూన్ 3: ధూమపానం వల్ల శరీరంలో కీలక అవయవాలు పాడై క్యాన్సర్‌కు దారితీస్తుందని తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.అరుణ అన్నారు. ధూమపాన వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రిలో అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా 60 లక్షల మంది పొగాకు వాడకం వల్ల చనిపోతున్నారని చెప్పారు. సైకాలజిస్టు డాక్టర్ ఎల్.సాయిబాలాజీ, జనరల్ మెడిసిన్ డాక్టర్ కె. శారదప్రసన్న, దంత వైద్యుడు డాక్టర్ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## చెరుకువాడ టీడీపీ నేత సత్యనారాయణకు మాతృ వియోగం



ఉండి, జూన్ 3:చెరుకువాడ గ్రామ టీడీపీ అధ్యక్షుడు యిర్రింకి సత్యనారాయణ తల్లి ఉత్తరవేణి(76) ఆదివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. సోమవారం చెరుకువాడలోని వారి నివాసానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు వెళ్లి ఉత్తరవేణి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి జుత్తుగ శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ కాగిత మహంకాళి, టీడీపీ నాయకుడు ఉంగరాల నాగేశ్వరరావు, కట్టా రాంబాబు, మంతెన సాయిలచ్చిరాజు తదితరులు పరామర్శించారు.







తణుకులో డ్రోన్ కెమెరా ప్రయోగిస్తున్న పోలీసులు.. తాడేపల్లిగూడెంలో ఒక అభ్యర్థి ఇంటి వద్ద పోలీసు బందోబస్తు

# డ్రోన్ కెమెరాలతో నిఘా.. పోలీసుల అప్రమత్తం

తణుకు, జూన్ 3: ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తప్పవని పట్టణ సీఐ ఎం. నాగరాజు అన్నారు. సోమవారం సాయంత్రం నరేంద్ర సెంటర్‌లో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించారు. తణుకు పట్టణంలో పటిష్ట బందోబస్తుతో పాటు అణువణువునా సీసీ కెమెరాలు, రెండు డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంటుందన్నారు. సర్కిల్ పరిధిలో హింసాత్మక ఘటనలు చెలరేగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. సామాజిక మాధ్యమాలు వేదికగా అవాస్తవాలను షేర్ చేసినా లేదా రెచ్చగొట్టే వ్యాఖ్యలను పోస్టు చేసిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఫలానా వారి తాలుకా అంటూ మోటారు సైకిళ్లపై నేమ్ ప్లేట్ ప్రదర్శిస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేస్తామన్నారు. పెట్రోలు బంకుల్లో విడిగా పెట్రోలు, డీజిల్ అమ్మరాదని ముందస్తుగా నోటీసులు జారీ చేశామని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుని బంకులు సీజ్ చేస్తామని వివరించారు. హోటళ్ళు, లాడ్జిలు, టీ దుకాణాలు మూసివేయాలన్నారు. 144 సెక్షన్, 30 యాక్టు అమల్లో ఉన్నందున గుంపులుగా తిరగవద్దన్నారు. రౌడీషీటర్లు, అనుమానితులు, ఘర్షణలకు పాల్పడే వారిపై నిఘా ఉంచామన్నారు.

**తాడేపల్లిగూడెం రూరల్:** మరికొద్ది గంటల్లో ఓట్ల లెక్కింపు మొదలు కానుంది. తాడేపల్లిగూడెం పట్టణంలో పోలీసులు భారీగా మొహరించారు. డీఎస్పీ మూర్తి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద గస్తీ పెంచారు. 120 మంది సిబ్బంది పహారా కాస్తున్నారు. పట్టణంలోని హోటల్స్, జ్యూస్ సెంటర్‌లు, లాడ్జిలు బంద్ చేస్తున్నట్టు పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. వాటితోపాటు ప్రధాన పార్టీల అభ్యర్థుల ఇళ్ల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. కవ్వింపు చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. సోషల్ మీడియాపై కూడా నిఘా ఉంటుందన్నారు.

# మేమే గెలుస్తాం..

## రికార్డు స్థాయి మెజార్టీతో గెలుస్తా: ఆర్ఆర్ఆర్



ఆకివీడు, జూన్ 3: సార్వత్రిక ఎన్నికలో తాను రికార్డు స్థాయి మెజార్టీతో ఉండి నియోజకవర్గంలో గెలుపొందుతానని టీడీపీ అభ్యర్థి కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం టీడీపీకి కంచుకోట కావడంతో పాటు కూటమి సమష్టి సహకారంతో పనిచేయడంతో ముందుకు సాగామని అన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి భారీ పోలింగ్ శాతం పెరగడంతో పాటు యువత, మహిళలే కీలక పాత్ర పోషించారని భావిస్తున్నానన్నారు. జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత, ఇతర రాష్ట్రాలు, జిల్లాలు నుంచి ఓటర్లు పోటెత్తి ఓటు వినియోగించుకోవడం కూటమికి అనుకూలాంశాలు అని అన్నారు. కౌంటింగ్ కేంద్రం దగ్గరకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రావద్దని విజ్ఞప్తి చేశారు. ర్యాలీలు, బాణసంచాలు కాల్చడం చేయవద్దని, టీవీ ముందు కూర్చుని ఫలితాలను వీక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## హ్యాట్రిక్ సాధిస్తా: నిమ్మల



పాలకొల్లు అర్బన్, జూన్ 3 : గత 10 ఏళ్ళుగా శాసనసభ్యునిగా చేసిన సేవలను గుర్తించి ఈసారి కూడా తనను ఎమ్మెల్యేగా మూడవ సారి నియోజకవర్గ ప్రజలు గెలిపించుకుంటారని, వారి రుణం తీర్చుకుటానని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. నియోజక వర్గంలో సుమారు రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. ఇప్పటికి వరకు నియోజకవర్గంలో ఎవరూ సాధించలేని హ్యాట్రిక్‌ను సాధిస్తానన్న నమ్మకం ఏర్పడిందన్నారు. ప్రజలతో నిత్యం సత్సంబంధాలు కలిగి ఉన్న నాయకుడినని ప్రజలు తప్పనిసరిగా ఆశీర్వదిస్తారని నమ్ముతున్నానన్నారు.

## అత్యధిక మెజారిటీ జాబితాలో ఉంటా: అంజిబాబు



భీమవరం రూరల్, జూన్ 3 : రాష్ట్రంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులలో అత్యధిక మెజార్టీతో గెలిచిన లిస్టులో తాను ఉంటానని భీమవరం నియోజకవర్గ కూటమి జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు ధీమా వ్యక్తం చేశారు. పదేళ్ళ పాటు ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు ప్రజలకు మంచి పాలన అందించానన్నారు. దానిని చూసి ప్రజలు అత్యధిక మెజార్టీ ఇచ్చారన్నారు. వైసీపీ మీద వ్యతిరేకత.. ఇక్కడ వైసీపీ అభ్యర్థి మీద ఉన్న వ్యతిరేకతకు తనకు భారీ విజయం ఖాయమన్నారు.

## ప్రతి రౌండ్‌లోను మెజారిటీ సాధిస్తా: నాయకర్



నరసాపురం, జూన్ 3: 'కూటమి అభ్యర్థిగా భారీ మెజార్టీతో విజయం సాధిస్తా. ప్రభుత్వ వ్యతిరేకత కారణంగా ఈసారి ప్రజలు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొనడమే నా మెజార్టీకి కారణం. ఇతర ప్రాంతాల నుంచి కూడా తరలివచ్చి ఓట్లు వేశారు. ప్రతీ రౌండ్‌లోనూ మెజార్టీ సాధిస్తా' అని జనసేన కూటమి అభ్యర్థి నాయకర్ అన్నారు. టీడీపీ, జనసేనతో పాటు బీజేపీ శ్రేణులు తన విజయానికి పెద్ద ఎత్తున కృషి చేశారన్నారు. పట్టణ ప్రాంతంతో పాటు గ్రామాల్లోనూ మెజార్టీ వస్తుంది. వైసీపీ ఆశించిన విధంగా మహిళా ఓట్లు ఆపార్టీకి పడే చాన్స్ లేదన్నారు. కూటమి పార్టీలపై ప్రజలకు నమ్మకం ఏర్పడిందని, మా మేనిఫెస్టో కూడా తన విజయానికి కలిసి వచ్చిందని అన్నారు.

## మంచి మెజార్టీ సాధిస్తా: ఆరిమిల్లి



తణుకు, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంచి మెజార్టీతో విజయం సాధిస్తానని, నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి వచ్చిన స్పందన మరువలేనిదని, నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందాలనే కసితో ప్రజలు కూటమికి ఓటేశారని, కూటమి ప్రభుత్వం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు అంతా భావించారని, అందుకే తాను మంచి మెజార్టీతో విజయం సాధించబోతున్నానని అన్నారు.

## జిల్లాలో అన్ని సీట్లు గెలుస్తాం : బొలిశెట్టి



తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 3: తాడేపల్లిగూడెం జనసేన కూటమి అభ్యర్థినైన తాను విజయం సాధించడం తథ్యమని, రాష్ట్రంలో కూటమి అధికారం చేపడుతుందని బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జిల్లాలో మొత్తం అన్ని సీట్లు గెలుస్తాం. తాడేపల్లిగూడెంలో భారీ మెజారిటీ వస్తుంది. ప్రజలంతా మార్పు కోరుకున్నారు. ఇది స్పష్టమవుతుంది. తాడేపల్లిగూడెంలో తన ప్రత్యర్థిపై వ్యతిరేకత కూడా తనకు కలసి వస్తుంది. కూటమికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులంతా సహకరించారు. మా విజయం తథ్యం.

## కమలం వికసిస్తుంది: శ్రీనివాసవర్మ



భీమవరం టౌన్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో నరసాపురం పార్లమెంట్‌లో కమలం వికసిస్తుంది. రాష్ట్రంలో, జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారు. దేశంలో నరేంద్రమోదీ పాలన కావాలన్న ఆకాంక్ష, ఆయన హయాంలోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నా సంకల్పంతో ఈసారి ఓటర్లు కూటమి అభ్యర్థుల విజయానికి నాంది పలికారు. ఈసారి ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లు వెల్లువలా వచ్చారు. ఇది ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనం.

## విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

మొగల్తూరు, జూన్ 3: జిల్లాలోని అన్ని మండలాల్లో విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ జిల్లా ఇన్‌చార్జ్ నల్లి నాగరాజు డిమాండ్ చేశారు. మొగల్తూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం 2009ని అధికారులు అమలు చేయాలని నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేసే ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా ముందస్తు అడ్మిషన్‌లు చేస్తూ పుస్తకాలు, ఏకీకృత దుస్తులు వారు చెప్పిన దుకాణాలలోనే కొనాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తేవడం సరైనది కాదని అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను నిరుపేదలకు ఉచితంగా కేటాయించాలని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని ప్రైవేట్ విద్యా సంస్థలు ఏమాత్రం పట్టించుకోకుండా విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడం లేదన్నారు. విద్యార్థుల సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## అన్నసమారాధనలు

పోడూరు, జూన్ 3: పోడూరు గ్రామంలోని ఇటుకలదిబ్బ రామాలయంలో గత నాలుగురోజులు పాటు నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలు సోమవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. అలాగే పోడూరు శివారు అంబటివాని చెర్వు ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అఖండ అన్నసమారాధన నిర్వహించారు.